ఆటలు ఆడేదెలా?

- పాఠశాలల్లో అతీగతీలేని మైదానాలు
- మినీ స్టేడియం పోలీసుశాఖకు కేటాయింపు
- ఆటలకు దూరమవుతున్న భావిక్రీడాకారులు


మినీ స్టేడియంలో కొనసాగుతున్న ఏఆర్ హెడ్‌క్వార్టర్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 20: జిల్లాలో ఆటలు అటకెక్కుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడామైదానాలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల కొరత అతిగతిలేని మైదానాలతో క్రీడలకు భావి క్రీడాకారులు దూరమవుతున్నారు. విద్యార్థులకు క్రీడలు అందని ద్రాక్షగా మిగిలిపోతు న్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు వారిలో దాగిఉన్న క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నారు.

ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో ఉన్న మినీ స్టేడియం జిల్లా ఏర్పాటులో భాగంగా పోలీసుశాఖకు కేటాయించారు. అందులో ఏఆర్ హెడ్‌క్వార్టర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలోని యువకులు, క్రీడాకారులు, వాకర్స్ వ్యాయామానికి దూరమవుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్రీడాప్రాంగాణాలు క్రీడా సదుపాయాలు లేకపోవడంతో అలంకార ప్రాయంగానే మిగిలిపోతున్నాయి.

సదుపాయాలకు నోచుకోని క్రీడాప్రాంగణాలు..

గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు సదుపా యాలకు నోచుకోవడంలేదు. ఈ ప్రాంగ ణాలు ఊరు చివర నిర్మించడం, చదునుగా లేకపోవడం, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగ దంతో ఆటలు ఆడేందుకు అనువుగా లేవు. దీంతో గ్రామీణ క్రీడా ప్రాంగ ణాలు అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామీణ క్రీడాకారులు తమలో దాగిఉన్న క్రీడా నైపుణ్యతను ప్రదర్శించలేకపోతున్నారు.

పాఠశాలల్లో మైదానాలు కరువు..

జిల్లాలో మొత్తం 1258పాఠశాలలుండగా ఇందులో 908ప్రాథమిక, 180 ప్రాథమికోన్నత, 170ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో సగానికి పైగా పాఠశాలల్లో క్రీడామైదానాలులేవు. ఇక వ్యాయమవిద్యను బోధించే పీఈటీ, పీఈడీ పోస్టులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోకుండా ఉన్నాయి. ప్రాథమిక స్థాయిలోనే నిర్బంధ వ్యాయామవిద్య ప్రవేశపెట్టి విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడే క్రీడలు వ్యాయమం ప్రభుత్వపాఠశాలల్లో ప్రవేశపెట్టాలి. కానీ ఆదిశగా ప్రభుత్వం దృష్టి సారించడంలేదు.

మినీ స్టేడియం పోలీసుశాఖకు కేటాయింపు..

జిల్లా కేంద్రంలో అధునిక హంగులతో లక్షలు వెచ్చించి నిర్మించిన మినీ స్టేడియంను ప్రభుత్వం పోలీసుశాఖకు కేటాయించింది. 2016లో జిల్లా ఏర్పడిన సందర్భంగా అప్పుడే పూర్తయి అందుబాటులో ఉన్న మినీస్టేడియాన్ని పోలీసుశాఖకు కేటాయించడంతో ప్రస్తుతం ఆ మినీ స్టేడియంలో ఏఆర్ హెడ్‌క్వార్టర్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పట్టణంలోని యువకులు, క్రీడాకారులు, విద్యార్థులు ఆటలు అడుకునేందుకు మైదానం లేకుండా పోయింది. ఇక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వాకింగ్, జాగింగ్ చేయాలంటే ఇబ్బందులు పడక తప్పడంలేదు. అలాగే పోలీసు, ఆర్మీ ఉద్యోగాల భర్తీ సమయంలో కసరత్తు చేసుకునేందుకు యువతకు క్రీడా మైదానం లేకపోవడంతో ప్రాక్టీస్ కోసం ఇతర ఖాళీస్థలాలే దిక్కవుతున్నాయి. మినీస్టేడియాన్ని తిరిగి అప్పగించాలని గతంలో యువజనసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు కూడా నిర్వహించారు.


క్రీడామైదనానికి నోచుకోని బూర్గుడ ఉన్నత పాఠశాల

వ్యాయామ విద్యను పకడ్బందీగా అమలు చేయాలి..

అవిడపు ప్రణయ్, జిల్లా యువజన సంఘం నాయకుడు



పాఠశాలల్లో వ్యాయామ విద్యను పకడ్బందీగా అమలుచేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. ప్రభుత్వం క్రీడామైదానాల నిర్మాణాలతో పాటు ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేయాలి. పట్టణంలోని మినీస్టేడియంను తిరిగి కేటాయిస్తే క్రీడాకారులకు వ్యాయామం చేసేందుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

బాలల హక్కులను కాపాడటం అందరి కర్తవ్యం


విద్యార్థినులు రాసిన అంశాలను పరిశీలిస్తున్న అదనపుకలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 20: బాలల హక్కులను కాపాడటం అందరి కర్తవ్యమని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం గన్నారం మహాత్మాజ్యోతిబా పూలే, గిరిజన సంక్షేమపాఠశాలలో ఏర్పాటు చేసిన సంకల్ప అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలబాలికలకు విద్య ఎంతో అవసరమన్నారు. చదువు, ఆరోగ్యం, విద్య, సంక్షేమం, సైబర్ క్రైం, బాల్యవివాహాలు, బాలల తరలింపు అంశాలపై వివరించారు. సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచి చక్కటి లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా సమన్వయ కర్త శారద, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త గోపాలకృష్ణ, విద్యాశాఖ సెక్టార్ అధికారి శ్రీనివాస్, సఖి సీఏ మమత, కౌన్సిలర్ శ్రీనిధి, మహిళా సాధికారత కేంద్రం ఆర్థిక అక్షరాస్యత ప్రత్యేక అధికారి సాగర్, జెండర్ స్పెషలిస్టు రాణి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఆధునిక సదుపాయాల ఏర్పాటుకు కృషి


శిశువుకు పరీక్షలు చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కౌటాల, సెప్టెంబరు 20: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధునిక సదుపాయాల ఏర్పాటుకు కృషిచేస్తానని డాక్టర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నార్మల్ డెలవరీ ద్వారా జన్మించిన నవజాత శిశువును పరీక్షించారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించి ఆసుపత్రిలో కావాల్సిన సదుపాయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఒకజనరేటర్, ఓటీటేబుల్, ఓటీ లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు, స్ట్రెచర్‌లు, వీల్‌చైర్లు తదితర పరికరాలు అవసరం ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నిధుల మంజూరు కృషి చేస్తామని సరైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అలాగే ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. డాక్టర్ సుంకన్న, నాయకులు రాజేందర్‌గౌడ్, మోతీరాం, యశ్వంత్, సత్తన్న, భీమన్న, తిరుపతి, వెంకటేష్, అశోక్, రవి, చందు, మధుకర్, శ్రీను,భూమయ్య, సిబ్బంది ఉన్నారు.

ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీ


సర్టిఫికేట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, డీఎంహెచ్‌వో

ఆసిఫాబాద్, సెప్టెంబరు 20: జాతీయ ఆరోగ్యపథకం కింద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, పారామెడికల్ సహాయ సిబ్బంది ఉద్యోగాలను ప్రధాన మంత్రి జన్‌మన్ కింద పీవీటీజీ అభ్యర్థులతో ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేశామని అదనపు కలెక్టర్ దాసరి వేణు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లావైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగాల భర్తీ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి తుకారంభట్‌తో కలిసి అభ్యర్థుల అర్హత ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 7స్టాఫ్‌నర్సు, 5ల్యాబ్ టెక్నీషియన్, 6పారామెడికల్ సహాయసిబ్బంది పోస్టులను భర్తీ చేశామని తెలిపారు.

బంగారు పతకం సాధించిన ఎఫ్ఆర్వో


జిల్లా అటవీఅధికారి నుంచి బహుమతి అందుకుంటున్న ఎఫ్ఆర్వో

కెరమెరి, సెప్టెంబరు 20: జిల్లాకేంద్రంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి అటవీ అధికారుల మారథాన్ క్రీడల్లో కెరమెరి అటవీ శాఖరేంజ్ అధికారి సయ్యద్ మజారోద్దీన్ 15కిలోమీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచాడు. ఈసందర్భంగా బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని జిల్లా అటవీశాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అందజేశారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం: సబ్ కలెక్టర్


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా

పెంచికలపేట, సెప్టెంబరు 20: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. శుక్రవారం మండలంలోని దర్గపల్లి గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో పోషణమాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గర్భిణులకు శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమతులమైన ఆహారాన్ని అందించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పాలు, గుడ్లు పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. ప్రతి చిన్నారి తగిన బరువు, ఎత్తు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయలు, పాలు పండ్లు తీసుకోవడం వల్ల సమతుల ఆహారం అందుతుందన్నారు. పోషకవిలువలు ఉన్న ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు సమన్వయంతో పరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిపట్లప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం సూపర్‌వైజర్లు, టీచర్లు సబ్ కలెక్ట ర్‌ను సన్మానించారు.

మీరైనా 'ఆసరా' అందించండి..

అంతకుముందు అక్కడికి వచ్చిన వృద్ధురాలు చింత పూరి ఐతక్క ఆసరా పెన్షన్ రావడం లేదని సబ్‌కలె క్టర్‌కు విన్నవించుకుంది. పలుమార్లు అధికారులకు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంది. మీరైనా ఆసరా కలిపించాలని వేడ్కొంది. పత్రాలు పరిశీలించిన సబ్‌కలెక్టర్ సమస్య పరిష్కరించాలని ఎంపీడీవోను ఆదేశించారు. అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో భాస్కర్, జిల్లా కోఆర్డినేటర్ గోపాలకృష్ణ, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ప్రవీణ్‌నాయక్, సీడీపీవో విజయలక్ష్మి, తహ సీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో అల్బర్ట్, సూపర్‌వైజర్లు హసీనా, కరుణ, పద్మ, శంకరమ్మ, షకీరా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ కొలావార్ సంఘం నాయకులు

బెజ్జూరు, సెప్టెంబరు 20: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండలానికి చెందిన ఆదివాసీ కొలావార్ సేవాసంఘంనాయకులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సంద్భంగావారు మాట్లాడుతూ మండల కేంద్రంలో కొలావార్‌సంఘ భవనంకు స్థలం ఉందని భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలనికోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పీవీటీజీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ పెండింగ్‌లోఉన్న సంఘభవన నిర్మాణానికి నిధుల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలోఆదివాసీ కొలావార్ నాయ కులు, రాయిసెంటర్ మేడి సతీష్, వెంకటేష్, తదిత రులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు వేయాలి ..

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ లోని ఎస్సీ, బీసీ కాలనీల్లో అంతర్గత రోడ్లు, సిమెంటు రోడ్లు, సైడ్‌డ్రైన్‌లను మంజూరు చేయించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ వెంకటేష్‌దోత్రేకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామస్థులు ఇగురపు సంజీవ్, ఇగురపు రాజేష్, చుక్కయ్య ఉన్నారు.



శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజయం


విజేత జట్టుతో అధికారులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 20: సింగరేణి వార్షికక్రీడల్లో భాగంగా శ్రీరాంపూర్‌లోని ప్రగతిమైదానంలో నిర్వహిస్తున్న కంపెనీస్థాయి వాలీబాల్‌పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజయంసాధించింది. రన్నరప్‌గా ఆర్‌జీ3-భూపాలపల్లి జట్టునిలిచింది. రెండు రోజులపాటు జరిగినపోటీల్లో ఆరుజట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌మ్యాచ్‌లో శ్రీరాంపూర్, ఆర్‌జీ3-భూపాలపల్లి జట్లుతలపడ్డాయి. ఉత్కంఠగా సాగినమ్యాచ్‌లో చివరకు శ్రీరాంపూర్ జట్టువిజేతగా నిలిచింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ ఇరుజట్లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలోఎస్‌వోటు జీఎంఎస్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, క్రీడల గౌరవకార్యదర్శి కె స్వజన్‌పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు చాట్ల అశోక్, నరేందర్ రెడ్డి, పి శ్రీనివాస్, రమేష్, కోఆర్డినేటర్ నర్సయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పిల్లల ఉన్నత విద్యకు ప్రోత్సాహం

మందమర్రి టౌన్, సెప్టెంబరు 20: సింగరేణి ఉద్యోగుల పిల్లల ఉన్నతవిద్యకు యాజమాన్యం ప్రోత్సాహాన్ని అందిస్తుందని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. శుక్రవారం ఏరియాలోని ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో జూనియర్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మద్దెలశంకర్ కూతురుకు పదివేల రూపాయలు, అదేవిధంగా సివిల్ డిపార్టుమెంట్ జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న కోలోజు రమేష్ కుమారుడికి పదివేల రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

'గని ప్రమాద కుటుంబాలకు సహాయం అందించాలి'

మందమర్రి టౌన్, సెప్టెంబరు 20: సింగరేణి కార్మికులు గని ప్రమాదంలో మృతి చెందితే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని సీఐటీయూ బ్రాంచికార్యదర్శి ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి కార్మికులు దేశప్రగతికి మూలస్థంభాలుగా నిలుస్తున్నారని, ఉత్పత్తి సాధనలో సమిధలవుతున్నారని తెలిపారు. అలాంటి కార్మికులు గని ప్రమాదంలో మృతిచెందితే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు రావాలన్నారు. ఇటీవల గని ప్రమాదంలో మృతిచెందిన మోకెనపల్లి లక్ష్మణ్ కుటుంబానికి ఆర్థికసాయంం అందించాలని డిమాండ్ చేశారు.

11వ వేజ్‌బోర్డు పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలి


మాట్లాడుతున్న రిటైర్డు కార్మికులు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 20: సింగరేణిలో మూడు నుంచి నాలుగుదశాబ్దాలకు పైగా సంస్థ అభివృద్ధి కోసం పనిచేసి ఉద్యోగవిరమణ పొందిన రిటైర్డుకార్మికులకు తక్షణమే 11వ వేజ్‌బోర్డు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రిటైర్డు కార్మికులు వాసాల శంకర్, శనిగారపు రాజేషం, సతీష్ డిమాండ్‌చేశారు. శుక్రవారం మందమర్రిలో రిటైర్డుకార్మికులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ 11వవేజ్‌బోర్డు ఏరియర్స్ కూడా యాజమాన్యం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గతంలో రెండు దశాబ్దాల క్రితం ఉద్యోగ విరమణ పొందిన వేలాది మంది రిటైర్డు కార్మికులకు 500నుంచి 1000పెన్షన్ వస్తోందన్నారు. ఆ పెన్షన్‌లో ఎటాంటి పెరుగుదల లేక ఆయా కుటుంబాలు దుర్బర జీవితం గడుపుతున్నాయన్నారు. కార్మికసంఘాలు ఈ విషయంలో చొరవచూపాలని తెలిపారు. 01.01.2017నుంచి 20.08.2018 మధ్యలో ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు గ్రాట్యుటీ ఎరియర్స్ లెక్కించి ఇవ్వాల్సి ఉందని, ఈ విషయాన్ని కోర్టులుకూడా తీర్పు ఇచ్చాయని, కోల్‌ఇండియా, సింగరేణి యాజమాన్యం దీనిని పరిగ ణలోకి తీసుకోవాలన్నారు. త్వరలోనే తాము ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిం చనున్నామని చెప్పారు. సమావేశంలో నాయకులు పుట్ట కొమురయ్య, ఎల్లయ్య, శనిగారపు రాజేషం, ఈర్ల రాజమౌళి, మొగిళి రెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

సింగరేణి సూపర్ బజార్ తెరవాలి

రెబ్బెన, సెప్టెంబరు 20: గోలేటి సింగరేణి సూపర్ బజార్‌ను తెరవాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ సెక్రెటరీ తిరుపతి సూపర్‌బజార్ ఎండీ విలాస్ పోతేదార్‌కు శుక్రవారంవినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఉన్న సింగరేణిసూపర్‌బజార్‌లో నిత్యావసర సరుకులు క్వాలిటీతో దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్యమొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల పెంపు కోసం చొరవ చూపండి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 20: సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టుకార్మికుల వేతనాలపెంపుకోసం చొరవ చూపాలని సింగరేణికాంట్రాక్ట్‌కార్మికల సంఘం (సీఐటీయూ) రాష్ట్రఅధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దూలం శ్రీనివాస్, బి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యే, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులకు లేఖలు రాశారు. గతంలో విడుదల చేసిన జీవో22ను గెజిట్‌చేసి సింగరేణి కాంట్రాక్టుకార్మికుల వేతనాలుపెరిగేలా, ఇతర సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలని వారు కోరారు.

క్వార్టర్ల కోసం కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 20: అధికారుల క్వార్టర్ల కోసం జీఎం కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలో పనిచేస్తున్న అధికారులు 30క్వార్టర్లకుగాను 6క్వార్టర్లుతీసుకున్నారు. ఈ కౌన్సెలింగ్‌లో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో జీఎం(సీపీపీ) పర్యటన


కైరిగూడ ఓసీని పరిశీలిస్తున్న జీఎం రమేష్

రెబ్బెన, సెప్టెంబరు 20: బెల్లంపల్లి ఏరియాలో శుక్రవారం జీఎం(కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) రమేష్ పర్యటించారు. ఈ సందర్భంగా కైరిగూడ ఓసీకి చేరుకొని ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉల్లిపిట్ట, డోర్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. ఆయన వెంట జీఎం శ్రీనివాస్, ఎస్‌వోటు జీఎం రాజమల్లు, పీవో ఎన్ ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 20: నాలుగు లేబర్‌కోడ్‌లు, మూడు నేరచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్రఅధ్యక్షుడు డిబ్రహ్మానందండిమాండ్ చేశారు. ఈమేరకు ఆయనశుక్రవారం శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో వాల్‌పోస్టర్లు విడుదలచేశారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడేందుకు, కార్మికులకు న్యాయం చేసేందుకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మేకల రామన్న, పోతుల కిష్టన్న, అప్పారావు, సమ్మయ్య, వెంకన్న, శంకర్, శారద, కవిత, స్వప్న, మల్లేశ్వరి, లక్ష్మీ, విజయ, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ కృషితోనే లాభాల వాటా

మందమర్రిటౌన్, సెప్టెంబరు 20: ఆర్థిక సంవత్సరా(2023-24)నికి సంబంధించి సింగరేణి కార్మికులు సంస్థకు సాధించి పెట్టిన లాభాల నుంచి 33శాతం వాటా ఇప్పిస్తున్న ఘనత తమ యూనియన్‌దేనని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. గతప్రభుత్వం 32శాతంవాటా ఇప్పించినప్పటికీ రూ.లక్ష నుంచి రూ.2లక్షలు వచ్చేవని, ప్రస్తుతం రూ.2లక్షల నుంచి 4లక్షలవరకు వస్తాయన్నారు. దసరాలోపు కార్మికులకు లాభాల వాటా చెల్లిస్తారని తెలిపారు.

శ్రీరాంపూర్: ఐఎన్‌టీయూసీ కృషితోనే ముందస్తుగా లాభాల వాటా ఇప్పిస్తున్నట్లు ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత యూనియన్ హయాంలో 20-10-2023న ఇచ్చారని, కానీ తమ యూనియన్ సెక్రెటరీ జనరల్ కృషితో వచ్చేనెల వేతనాలతో లాభాల వాటా, బోనస్‌ను ఇప్పిస్తున్నట్లు చెప్పారు.

కాంట్రాక్టు కార్మికులకు రూ. 5వేలు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 20: సింగరేణిలో ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులకు సైతం లాభాల వాటా ఇవ్వాలనే డిమాండ్ ఉన్న నేపథ్యంలో వారికి సైతం 5వేల రూపాయల చొప్పున చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. దీంతో కాంట్రాక్టు కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ కష్టాన్ని యాజమాన్యం గుర్తించిందని, అందులో భాగంగానే లాభాల వాటాలో 5వేల రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, ఖరి, తిరుపతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



రేగుల సతీష్ (ఫైల్)

తాండూర్, సెప్టెంబరు 20: గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన తాండూర్ మండల జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి హనుమాన్ బస్తీకి చెందిన రేగుల సతీష్ (39) అనే యువకుడు కాగజ్‌నగర్ లోని అత్తగారింటి నుంచి స్వగ్రామమైన బెల్లంపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో తాండూర్ మండలంలోని కిష్టంపేట గ్రామ జాతీయ రహదారిపై సుమంగళి ఫంక్షన్ హాల్ వద్ద గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న సతీష్ తలకు బలమైన గాయం కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాండూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సమాచారం సేకరించారు. మృతుడికి భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.

లేదాళ్ల రాజేశ్వరరావుకు విమలాశాంతి కవితా పురస్కారం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 20: లక్సెట్టిపల్లి గ్రామానికి చెందిన కవి లేదాళ్ల రాజేశ్వరరావుకు విమలాశాంతి కవితా పురస్కారం దక్కింది. విమలాశాంతి సాహిత్య, సామాజిక సేవా సమితి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన రచయితల్లో ఒకరిని పురస్కారానికి ఎంపిక చేస్తున్నామని సమితి వ్యవస్థాపకులు శాంతి నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరానికి సంబంధించి లేదాళ్ల రాజేశ్వరరావు రచించిన 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' కవితా సంపుటిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారని తెలిపారు. అక్టోబరు 20న అనంతపురంలో లేదాళ్ల రాజేశ్వరరావుకు విమలాశాంతి కవితా పురస్కారంతోపాటు రూ.10 వేల నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

దండేపల్లి, సెప్టెంబరు 20: అనారోగ్యంతో వ్యవసాయ బావిలో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. చింతపల్లికి చెందిన అనూష (34)కు లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ చెందిన అప్పని శ్రీనివాస్‌తో 14ఏళ్ల క్రితం వివాహం జరుగగా వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. 6 ఏళ్ల నుంచి అనూ షకు మానసిక పరిస్థితి బాగలేదు. చికిత్స చేయించినా ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగు పడలేదు. 20రోజుల క్రితం లక్ష్మీపూర్‌లో ఇంటి వద్ద కరెంట్ వైర్లను ముట్టకోవడంతో షాక్‌కు గురై కిందపడింది. గమనించిన భర్త శ్రీనివాస్ చికిత్స చేయించాడు. వైద్యులు 15 రోజులు రెస్ట్ తీసుకోవాలని సూచించడంతో అనూషను తల్లిగారిల్లు చింతపల్లికి తీసుకెళ్లారు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రపోగా శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు లేచి చూసే సరికి ఆమె కనిపించలేదు. చుట్టు పక్కల వెతకగా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. మానసిక పరిస్థితి బాగలేకనే బావి లో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి గొర్ల తిరుపతి తెలి పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజేందర్ వెల్లడించారు.

వ్యభిచార ముఠా అరెస్ట్

రామకృష్ణాపూర్, సెప్టెంబరు 20: పద్మావతి కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలి పారు. ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్న మహ్మద్ మొయిన్, అవంతిలు మంచి ర్యాలకు చెందిన మహిళ ద్వారా పలు రాష్ట్రాలకు చెందిన మహిళ లను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏలూరుకు చెందిన ఒక మహిళను ఇక్కడకు తీసుకువచ్చి ఆమె ఫొటోలను మంచిర్యాల, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్‌లకు చెందిన కొందరికి సోషల్ మీడియాలో పం పించారు. మంచిర్యాల చున్నంబట్టి వాడకు చెందిన ఆకునూరి సంపత్ అనే విటుడు శుక్రవారం మహిళతో మాట్లాడుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. వ్యభిచార గృహం నడుపుతున్న మొయిన్‌తోపాటు ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. బాధిత మహిళను సఖీ సెంటర్‌కు తరలించామని పేర్కొన్నారు. పట్టణ ఎస్సై రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

గర్మిళ్ల, సెప్టెంబరు 20: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన అఘాయిత్యంపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్త బం ద్ విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాటం సమితి తుడుందెబ్బ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు పెంద్రం హన్మంతు, కుర్సెంగ తిరుపతి,వల్క చిలుకయ్య, రఘుపతి, మల్లేష్, బాపురావు, భార్గవ్, రాజ్‌కుమార్,అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జన్నారం: జైనూరులో మహిళపై జరిగిన ఘటనపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ నాయకులు సోనేరావుపటేల్, కాళీ, ధర్ము పటేల్‌లు కోరారు. శుక్రవారం జన్నారంలో వారు మాట్లాడుతూ మహిళపై ఇంతటి అఘాయిత్యం జరిగినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. బంద్‌లో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, గంగుపటేల్, జంగు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మత్తడి పేల్చివేత కేసులో నిందితుల అరెస్టు

- ట్రాక్టర్, బైక్, పేలుడు పదార్థాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్

చెన్నూరు, సెప్టెంబరు 20: పట్టణంలోని శనగకుంట చెరువు మత్తడి ధ్వంసం కేసులో ప్రధాన నిందితులైన నలుగురిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. శుక్రవారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని బేతాళివాడకు చెందిన పెండ్యాల లక్ష్మీనారాయణ, మారెమ్మవాడకు చెందిన భీం మధుకర్, రాసమల్ల శ్రీనివాస్, ఏసీసీకి చెందిన గోగుల దానయ్యలు చెరువు మత్తడిని ధ్వంసం కేసులో అరెస్ట్ చేశామన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ పరిధిలోని సర్వే నంబర్లు 355, 356, 357, 358, 359, 360 సర్వే నంబర్లలో 15.20 ఎకరాల భూమి గోదావరిఖని ప్రాంతానికి చెందిన చెరుకు బుచ్చిరెడ్డి పేరు మీద ఉందన్నారు. ఆ భూమిని పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులైన మంచాల రాజబాపు, నడిపెల్లి లక్ష్మణ్‌రావు, లక్కం రాజబాపు, రాంలాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య, పెద్దింటి శ్రీనివాస్, పోగుల శేఖర్, ఎన్నం బానయ్య, ఇప్ప సంపత్, ఉమేష్ గిల్డాలు కొనుగోలు చేశారన్నారు. వీరు ఈ భూమిని పట్టణానికి చెందిన గొడిసెల బాపురెడ్డికి విక్రయించారన్నారు. అయితే అందులో 4.20 ఎకరాలు మాత్రమే బాపురెడ్డి పేరు మీద రిజిస్ట్రేషన్ అయ్యిందన్నారు. మిగిలిన 11 ఎకరాలు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండగా రిజిస్ట్రేషన్ కాలేదన్నారు. దీంతో ఈ ఇరు పార్టీల మధ్య వివాదాలు చెలరేగుతున్నాయన్నారు. వివాదం ఉన్న 11 ఎకరాల భూమిలో మట్టి పోసి ప్లాట్లుగా మార్చేందుకు పథకం పన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిలో మట్టి నింపడం తో వర్షాల మూలంగా వరద నీరు చెరువులో చేరి కింది ప్రాంతంలోని బేతాళివాడ, మారెమ్మవాడ, మహంకాళివాడ, తదితర కాలనీల్లోని ఇండ్లలోకి నీరు వస్తోందన్నారు. 11వ వార్డు కౌన్సిలర్ భర్త పెండ్యాల లక్ష్మీనారాయణ, భీం మధుకర్, రాసమల్ల శ్రీనివాస్‌లు పథకం ప్రకారం చెరువు మత్తడి ఎత్తును తగ్గించడానికి డ్రిల్ మిషన్‌తో పగల గొట్టేందుకు పథకం పన్నారు. మంచి ర్యాల ఏసీసీ ప్రాంతానికి చెందిన గోగుల దానయ్యను సంప్రదించగా రూ.30 వేలకు ఒప్పుకొన్నాడ న్నారు. ఈ నెల 13న రాత్రి దానయ్య చెరువు మత్తడిని పగులగొట్టే ప్రయత్నం చేయగా విఫలమైంది. జిలెటిన్ స్టిక్స్‌తో పగులగొట్టవచ్చని దానయ్య పేర్కొన్నాడన్నారు. పేలుడు పదార్థం నల్గొండలో దొరుకుతుందని, మరికొంత డబ్బు కావాలనడంతో భీం మధుకర్ ఫోన్‌పే నుంచి దానయ్య కొడుకు గోగుల శ్రావణ్‌కుమార్‌కు రూ.17 వేలు పంపించాడన్నారు. ఈ నెల 16న రాత్రి పెండ్యాల లక్ష్మీ నారాయణ, రాసమల్ల శ్రీనివాస్, భీం మధుకర్, గోగుల దానయ్యలు చెరువు వద్దకు చేరుకుని జిలెటిన్ స్టిక్స్ అమర్చి మత్తడి బ్లాస్టింగ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇంకా విచారణ కొనసాగుతుందన్నారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు డీసీపీ పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి ట్రాక్టర్, బైక్, కంప్రెషర్ డ్రిల్లింగ్ మిషన్, పేలుడు పదార్థాలు, జీఏ వైరు, బ్లాస్టింగ్ వైరు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన ఏసీపీ వెంకటేశ్వర్‌తో పాటు సీఐ రవీందర్, ఎస్ఐ శ్వేత, కానిస్టేబుల్ టిక్కయ్య, భూమన్న, హోంగార్డు అబ్దుల్ ఖాదీర్‌ను డీసీపీ అభినందించారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

చెరువులను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జన్నారం, సెప్టెంబరు 20: మండలంలోని చెరువులను, ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీఖాన్, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్‌లు పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అక్రమంగా చెరువులు, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. హైడ్రా తరహాలోనే మండలాల్లో ప్రత్యేకంగా చట్టం తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. నాయకులు సుభాష్‌రెడ్డి, శంకరయ్య, మోహన్‌రెడ్డి, ఇసాక్, రియాజుద్దీన్, పసివుల్లా, మాణిక్యం, సుధాకర్ నాయక్, పంకజ, లక్ష్మీ, రాయమల్లు, సాకీర్, లక్ష్మీనారాయణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య పరీక్షలు

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 20: శంషీర్‌నగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 10 అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు శుక్రవారం హనుమాన్ బస్తీలోని ఎస్‌వీఎస్ పాఠశాలలో స్క్రీనింగ్ పరీక్షలను వైద్యురాలు సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యురాలు పిల్లల తల్లిదండ్రులకు పౌష్టికాహారం, ఎత్తు, బరువు పెరగడానికి సూచనలు అందించారు. డీడబ్ల్యూవో స్వరూపరాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పుష్పలత, ప్రసన్న, విష్ణుప్రియ, ప్రభావిత, పోషణ్ అభియాన్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ రజిత, డీపీఏ శ్యామల, సుజాత, ఏఎన్ఎం రుబియా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 20: సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు నడిచే వందేభారత్ రైలును మంచిర్యాలలో ఆపాలని శుక్రవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మంచిర్యాల రైల్వేస్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందించారు మంచిర్యాల నుంచి రోజు వేలాది మంది సికింద్రాబాద్, నాగ్‌పూర్, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారని తెలిపారు. రైలు ఆపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వందేభారత్ రైలును మంచిర్యాలలో ఆపాలని కోరారు. నాయకులు మల్లయ్య రామన్న, జ్యోతి,అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 28న జిల్లా స్థాయి ఆర్ట్, క్రాఫ్ట్ మేళా

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 20: వ్యర్థం నుంచి అర్థం అనే అంశంపై ఈ నెల 28న జిల్లా స్థాయి ఆర్ట్, క్రాఫ్ట్ మేళా నిర్వహిస్తున్నామని డీఈవో యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదన మేరకు మేళా నిర్వహిస్తున్నామన్నారు. వ్యర్థాలను తగ్గించి, ఉపయోగకరమైన వస్తువులను తయారు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించడానికి మేళా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఉత్తమ ప్రదర్శనలకు ప్రథమ రూ.3వేలు, ద్వితీయ రూ.2వేలు, తృతీయ బహుమతిగా రూ.1000 నగదును అందిస్తామని, పాల్గొనే వారికి ప్రయాణ భత్యంతోపాటు భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలను జిల్లా సైన్స్ అధికారి, ఎన్ జీసీ జిల్లా కోఆర్డినేటర్ మధుబాబుకు రిపోర్టు చేయాలని డీఈవో సూచించారు.

బంగారు తండాలో పర్యటించిన విద్యుత్ అధికారులు

జన్నారం, సెప్టెంబరు 20 : బంగారు తండాలో శుక్రవారం విద్యుత్ ఎస్ఈ శ్రావన్‌కుమార్, డీఈ కైసర్, ఏడీఈలు తిరుపతి, ప్రభాకర్, ఏఈ లచ్చన్నలు పర్యటించారు. గ్రామంలోని విద్యుత్ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తా మని, వరికోతలు పూర్తయ్యాక పొలాల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ

జైపూర్, సెప్టెంబరు 20 : మండలంలోని ఇందారం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మహాలక్ష్మీ పథకం లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావులు అందజేశారు. అనంతరం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా డ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌కు స్థలం కేటాయించాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 20 : పట్టణంలోని 13వ వార్డు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఖాళీ స్థలంలో ఓపెన్ జిమ్, పిల్లల పార్కు, బతుకమ్మ ఉత్సవాలకు స్థలం కేటాయించాలని వార్డు ప్రజలు శుక్రవారం ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో బీజేపీ నాయకుడు అరెస్టు

లక్సెట్టిపేటరూరల్, సెప్టెంబరు 20: సంతకాలు ఫోర్జరీ చేసి భూమి కబ్జా చేసిన కేసులో దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు అజ్మీర హరినాయక్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. శుక్రవారం సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలను వెల్లడించారు. అజ్మీర హరినాయక్ 1998లో అల్లీపూర్ గ్రామానికి చెందిన పట్వారీ లక్ష్మణ్‌రావుకు చెందిన 7.26 ఎకరాల భూమిని హరినాయక్‌కు అమ్మినట్లు నకిలీ పత్రాలు తయారు చేసి భూమిని కబ్జా చేశాడన్నారు. లక్ష్మణ్‌రావు ఆ భూమిని 1990లో నలుగురు కొడుకులకు పట్టా చేశాడని తెలిపారు. హరినాయక్ వాళ్లను బెదిరింపులకు గురి చేయడంతోపాటు భూమిపైకి వస్తే ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని పలుమార్లు బెదిరించాడు. లక్ష్మణ్‌రావు కొడుకు మురళీధర్ రావు తన తండ్రి భూమి ఎవరికి అమ్మలేదని, నకిలీ పత్రాలతో బెదిరిస్తున్నట్లు దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. నిందితుడు తయారు చేసిన పత్రాలు దొంగ పత్రాలు అని తేలాయని, లక్ష్మణ్‌రావుకు సంతకం చేయడం వచ్చని, అతని పాసుపుస్తకాలు చూపించాడు. నిందితుడు హరినాయక్ పత్రాలపై వేలి ముద్రలు ఉన్నాయని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. కేసును ఛేదించిన సీఐ అల్లం నరేందర్, దండేపల్లి ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌తోపాటు ఎస్ఐ సతీష్, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాష్

అటవీ భూమిని ఆక్రమించిన పది మంది అరెస్టు

జన్నారం, సెప్టెంబరు 20 : ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని సోనాపూర్ తండాలో అటవీ భూమిని ఆక్రమించుకుని నివాసం ఏర్పర్చుకున్న పది మంది గిరిజనులను అరెస్టు చేసినట్లు ఇందన్‌పల్లి ఎఫ్ఆర్‌వో హఫీజుద్దీన్ శుక్రవారం తెలిపారు. కుమరంభీంఆసిఫాబాద్‌జిల్లా లింగాపూర్ చెందిన కుమ్రం లక్ష్మణ్, సిడాం మోతిరాం, పెందుర్ జలపతి, కనకచంద్రబాన్, జైనూరు మండలానికి చెందిన మ్యాన్కు, మెస్రం గంగారాం, ఆత్రం లాల్‌సావ్, సిర్పూర్‌కు చెందిన తొడసం విష్ణు, బాబు, సురేబాన్‌లను అరెస్టు చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చినట్లుతెలిపారు.

రామకృష్ణాపూర్‌లో పోలీసుల తనిఖీలు

రామకృష్ణాపూర్, సెప్టెంబరు 20: రామకృష్ణాపూర్‌లోని అన్ని ఏరియాల్లో గంజాయికి బానిసలుగా మారిన కొందరి ఇండ్లలో శుక్రవారం ఎస్సై రాజశేఖర్ తనిఖీలు చేపట్టారు. సిబ్బంది డాగ్ స్క్వాడ్ సహాయంతో గంజాయి సేవించే వారి ఇండ్లలో సోదాలు నిర్వహించారు. మాట్లాడుతూ గంజా యికి దూరంగా ఉండాలని, తాగిన, విక్రయించినా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

వాగులో చిక్కుకున్న వారిని కాపాడిన స్థానికులు

కన్నెపల్లి, సెప్టెంబరు 20: భీమిని మండలంలోని చిన్న తిమ్మాపూర్, తంగళ్లపల్లికి మధ్యలో ఎర్రవాగులో ట్రాక్టర్‌తో సహా ఐదుగురు చిక్కుకున్నారు. శుక్రవారం కన్నెపల్లి మండలంలోని మాడవెల్లి గ్రామ పంచాయతీలోని బొత్తపల్లి గ్రామానికి చెందిన అట్కూరి రవి అనే రైతు ఐదుగురు కూలీలకు ట్రాక్టర్ ఇచ్చి మందు బస్తాలు వేసుకుని తిమ్మాపూర్‌లోని పంట చేనుకు వెళ్లాలని సూచించాడు. కూలీలు పత్తి పంటకు మందు వేసి తిరిగి వస్తుండగా వాగు మధ్యలోకి రాగానే ఎగువన కురిసిన వర్షానికి వాగు ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. దీంతో ట్రాక్టర్‌తో సహా ఐదుగురు వాగులో చిక్కుకున్నారు. కేకలు వేయడంతో స్థానికులు వచ్చి వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ట్రాక్టర్ వాగులోనే ఉండిపోయింది. చిన్న తిమ్మాపూర్, తంగళ్లపల్లికి మధ్యలో ఎర్రవాగుకు బ్రిడ్జి లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వాగుపై వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


వాగులో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువస్తున్న స్థానికులు

కళాశాలలో ఫ్రెషర్స్ డే



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 20: ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి అంజయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరు కుంటారని తెలిపారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. బాలుర కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య ప్రిన్సిపాల్ స్వరూప, అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

పంచాయితీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 20 : జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి నరేందర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో వినతి పత్రాలను సమర్పించామని తెలిపారు. గ్రామపంచాయతీలకు నిధుల కొరత వల్ల కార్యదర్శులు తమ జీతాల నుంచి ఖర్చులు చేయాల్సి వస్తుందన్నారు. రానున్న బతుకమ్మ, దసరా పండుగల ఖర్చులు కార్యదర్శులకు మోయలేని భారంగా మారనున్నాయని, ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే ఖర్చు చేసిన డబ్బులకు, ఐఎఫ్ఎంఎస్ ద్వారా పేమెంట్ చేసిన చెక్కులు సుమారు 10 నెలలుగా క్లియర్ కాలేదని, దీంతో ఏ ఏజెన్సీ గానీ, ఫెర్మ్ గానీ, షాపు గానీ క్రెడిట్ ద్వారా సామాగ్రి ఇవ్వలేని పరిస్థితి నెలకొందని, వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రసూతి, శిశుమరణాలపై సమీక్ష

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 20: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం డీఎంహెచ్‌వో హరీష్‌రావు ప్రసూతి, శిశు మరణాలపై సమావేశం నిర్వహించారు. గతేడాది తాండూర్, అంగ్రాజ్‌పల్లి, శంషీర్‌నగర్ ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన మాతృ మరణాలపై సమీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రసూతి మరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి గర్భవతులను నమోదు చేయాలని, వైద్యాధికారితో పరీక్షలు చేయించాలన్నారు. 102 వాహనంలో ఆసుపత్రికి తరలించి స్కానింగ్ చేయించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనేప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీపీఎం ప్రవళిక, డీడీఎం పద్మ, డాక్టర్లు సుధకార్, అనిత, కృప, సీతారామరాజు, అరుణశ్రీ, కాంతారావు, శ్రీనివాస్, నందిని పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కి విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 20: జిల్లాకేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలకుచెందిన విద్యార్థులు ఈనెల25,26,27తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్ రావు తెలిపారు. ఈనెల19న గోదావరిఖనిలో పెద్దపల్లి, మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులు గుత్తివిక్రం, పిర్సింగుల అన్విత, ఎల్ రేవంత్, వి భార్గవి, జె సాయి తేజ, ఆర్ శ్రీనిహారిక, బి జశ్వంత్, దుర్గం శాన్వి, హిప్రే రాజేశ్వర్, కోలే నిఖిత, సద్గారి ఐశ్వర్య, నికూరేస్వరూప, కవల్కర్‌నిఖిత మంచిప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లుతెలిపారు. వీరినిట్రస్టుజిల్లా అధ్యక్షుడు దేవభూషణం, రాధాకృష్ణచారి, హరిప్రియ, రమాదేవి, వైష్ణవి, స్వాతి, దుర్గ, సత్యనారాయణ, దీపక్‌కుమార్ అభినందించారు.

జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు


ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 20: జిల్లా కేంద్రంలోని జక్కాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం అండర్-14,17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికపోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో వందమంది బాలబాలికలు పాల్గొన్నారు. అండర్-14లో బాలికలు3, బాలురు5, అండర్-17లో బాలికలు5, బాలురు5 ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, పీఈటీ ప్రవీణ్, స్పోర్ట్స్ ఆఫీసర్ మీనారెడ్డి, క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబవివరావు, పీడీలు, పీఈటీలు మధుసుదన్, విద్యా సాగర్, శారద తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ రికార్డులు స్వాధీనం

బెజ్జూరు, సెప్టెంబరు 20: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విత్తనాలు, ఎరువులు, ఇతర లావాదేవీల్లో జరిగిన అవకతవకల నేపథ్యంలో శుక్రవారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో సొసైటీకి సంబంధించిన రికార్డులను స్వాధీనపర్చుకున్నారు. సొసైటీకి సంబంధించి పూర్తిస్థాయి లావాదేవీలు, ఇతరఅంశాలను పరిశీలించి విచారించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆమెవెంట సీనియర్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం

కౌటాల, సెప్టెంబరు 20: మండల ఆర్యవైశ్యసంఘం కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని వాసవిమాత ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలక సిద్దేశ్వర్, ఉపాధ్యక్షుడిగా ఎలక వెంకటేశ్వర్, ప్రధానకార్యదర్శిగా గోపాశెట్టి అనీల్, కోశాధికారిగా రాచకొండ ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా ఎలక మురళీధర్, ముఖ్య సలహాదారులుగా పుల్లూరి విజయకుమార్, వొజ్జల వెంకటేశ్వర్, ఎలక వెంకటేశ్వర్, గౌరవఅధ్యక్షుడిగా బొమ్మకంటి దివాకర్, బోనగిరి సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి: ఆర్టీసీ డీఎం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 20: ఆర్టీసీ బస్సుల్లో, ప్రయాణ ప్రాంగణాల్లో ప్రయాణికులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని డిపోమేనేజర్ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం ఆర్టీసీ మర్యాద దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్‌లో ప్రయాణించే ప్రయాణికులకు పుష్పాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది చిరునవ్వుతో ప్రయాణికులను పలకరించి వారితో మర్యాదగా మెలగాలన్నారు. ఈ మర్యాద దినోత్సవాన్ని డిపోలో ప్రతినెల మూడవ శుక్రవారం నిర్వహిస్తామన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

ఆర్టీసీ సిబ్బంది వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిపోమేనేజర్ విశ్వనాథ్ అన్నారు. డిపోఆవరణలో గ్రాండ్‌హెల్త్ చాలెంజ్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని సంస్థ ఎండీ గతంలో గ్రాండ్‌చాలెంజ్‌ను నిర్వహించి వైద్యపరీక్షలను చేపట్టా రన్నారు. రెండో విడతలో సిబ్బంది జీవిత భాగస్వామికి వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఈనెల 24వరకు వైద్యశిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా హైదరాబాద్ నుంచివచ్చిన వైద్యసిబ్బందిపరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ సరియా, లీడింగ్‌హ్యాండ్ నాగరాజు, హెల్త్‌వాలంటరీ ప్రేమల, ఉద్యోగులు పాల్గొన్నారు.


ప్రయాణికులకు పుష్పం అందజేస్తున్న డీఎం విశ్వనాథ్

'ఐసీడీఎస్‌ను యథావిధిగా కొనసాగించాలి'

ఆసిఫాబాద్, సెప్టెంబరు 20: ఐసీడీఎస్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ శుక్రవారం డీడబ్ల్యూవో భాస్కర్‌కు సీఐటీయూనాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఆర్యాతండాలోని అంగన్‌వాడీకేంద్రంలో 3వతరగతివరకు పూర్వప్రాథమికవిద్యను ప్రారంభించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఐసీడీఎస్‌ను యథావిధిగా స్వతంత్రంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు త్రివేణి, వనిత, సువర్ణ, సరోజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 20: జిల్లాలో విశిష్టసేవలు అందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు అక్టోబరు1న నిర్వహించనున్న అంతర్జాతీయ వయోవృద్ధులదినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందిస్తామని జిల్లాసంక్షేమ శాఖాధికారి (డీడబ్ల్యూవో) భాస్కర్‌తెలిపారు. అర్హులైన వారు ఈనెల25లోగా హైదరాబాద్ మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమభవనంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 20: ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టువర్కర్స్, ఔట్‌సోర్సింగ్, నాన్‌పర్మినెంట్ కార్మికులసమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రంఅందజేశారు. ఈసందర్భంగా ఆసంఘం నాయకుడు కృష్ణమాచారి మాట్లాడుతూ కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్,బోనస్, గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు, ఆ సంఘం నాయకులు శ్రీకాంత్, రాజు, సమ్మయ్య, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

24న రేషన్ డీలర్ల సదస్సు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 20: ఈనెల24న సంగారెడ్డిలో నిర్వహించతలపెట్టిన రాష్ట్రస్థాయి రేషన్‌డీలర్ల సదస్సును జయప్రదం చేయాలని డీలర్లసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరావు, మండలాధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. జిల్లాలోని రేషన్‌డీలర్లు పెద్దసంఖ్యలో సదస్సుకుహాజరై విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా లెవల్ కమిటీపై కేసు నమోదు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 20: ప్రభుత్వఉపాధ్యాయుడు ఆశ్రఫ్‌పై తప్పుడు నివేదిక ఇచ్చిన జిల్లాస్థాయి కమిటీపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు రూరల్‌ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆశ్రఫ్ తనకు అన్యాయం జరిగిందని కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఇచ్చిన సూచనల మేరకు జిల్లా లెవల్ కమిటీపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు ఎస్సై పేర్కొన్నారు. జిల్లాలెవల్ కమిటీలో జాయింట్ కలెక్టర్ బి రాజేశం, ఎస్సీ డెవలప్‌మెంటు అధికారి సజీవన్, జిల్లా బీసీ డెవలప్‌మెంటు అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ మైనార్టీ అధికారి షేక్‌మహమూద్, జిల్లా ఇన్‌చార్జీ వ్యవసాయశాఖ అధికారి శ్రీని వాసరావు, ఇంటర్ నోడల్ అధికారి శ్రీధర్ ఉన్నట్టు వీరందరిపై కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

సిర్పూర్(టి),సెప్టెంబరు 20: మండలంలోని 16 గ్రామ పంచాయతీలో ఫొటోఓటరుజాబితాను ప్రచురించామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల21లోగా లిఖితపూర్వకంగా రాసిఇవ్వాలని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు.

నలుగురిపై గృహహింస కేసు నమోదు

దహెగాం, సెప్టెంబరు 20: మండలంలోని బీబ్రా గ్రామానికి చెందిన నలుగురిపై గృహహింస కేసు నమోదు చేసినట్లు ఎస్సై కెరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పదినెలల క్రితం దుర్గం కవిత, జుమ్మిడి గీతాచారి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం వరకట్నం తీసుకురావాలంటూ కవితను గీతాచారి శారీరకంగా, మానసికంగా వేధించాడు. ఈ మేరకు అత్త జుమ్మిడి అమృత, మామ జుమ్మిడి రాందాస్, ఆడపడుచు జుమ్మిడి తేజరాణి, భర్త గీతచారిపై కవిత ఫిర్యాదుచేసినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు నలుగురిపై గృహహింస కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సోనాపూర్ పాఠశాలలో మొబైల్ ప్లానిటోరియం

రెబ్బెన, సెప్టెంబరు 20: మండలంలోని సోనాపూర్ ప్రాథమికపాఠశాలలో మొబైల్‌ప్లానిటోరియం కార్యక్రమాన్ని నిర్వహించినట్టు జాడీసీల తెలిపారు. ఈ సందర్భంగా సోలార్‌సిస్టం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, రైమ్స్ తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చల్లూరి ధర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం


కాగజ్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్/కెరమెరి, సెప్టెంబరు 20: జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. ఆసిఫాబాద్ మండలంలో ఓ మోస్తరు వర్షం కురియగా కాగజ్‌నగర్‌లో భారీవర్షం కురిసింది. అలాగే కౌటాల, కెరమెరి, సిర్పూర్(టి), దహెగాం, వాంకిడి, పెంచికలపేట, చింతలమానేపల్లి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పత్తిరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. అలాగే అంతర్గత రోడ్లు బురదమయం అయ్యాయి. ఉదయం నుంచి ఎండవేడిమితో ఇబ్బందులు పడిన పట్టణవాసులు ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

పెంచికలపేట, సెప్టెంబరు 20: మండలంలోని ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులకు చికిత్సలు నిర్వహించిమందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సతీష్, సీహెచ్‌వో అనర్తి హల్దార్, సిబ్బంది మాధురి, ధర్మారావు, భాగ్యలక్ష్మి, సావిత్రి, సోని, ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పంటల పరిశీలన

పెంచికలపేట, సెప్టెంబరు 20: మండలంలోని గుంట్లపేట గ్రామంలో కొద్దిరోజుల క్రితం ఎగువన కురిసిన వర్షాలకు పెద్దవాగు ఉప్పొంగి ముంపునకు గురైన పంటలను శుక్రవారం ఏఈవో శివకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపునకు గురైన రైతుల పంటల వివరాలు సేకరించి ఉన్నతాధికారు లకు పంపిచనున్నట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి

బెజ్జూరు, సెప్టెంబరు 20: ఆదివాసీ మహిళపై దాడి చేసిన షేక్‌మగ్దుంకు వెంటనే ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఆదివాసీ కొలావార్ మస్నేవార్, తుడుందెబ్బ ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ కొలావార్, తుడుందెబ్బ నాయకులు ప్రకాష్, నాగేష్, వెంకటి, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు కోరారు.





రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

గర్మిళ్ల, సెప్టెంబరు 20: రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మోటపలుకుల సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బొమ్మ సత్యనారాయణరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రేషన్‌డీలర్లు పలు సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. రేషన్ డీలర్లకు కమీషన్ రూ.300 ఇవ్వాలని, నెలకు రూ.5 వేల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాలు చేస్తామన్నారు. కృష్ణ, సుమతి, మహేందర్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

బీజేపీ దిష్టిబొమ్మ దహనం


బీజేపీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 20: రాహుల్‌గాంధీపై బీజేపీ నేత తన్వీర్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం రాష్ట్రీయ రహదారిపై ప్రధాని కాంగ్రెస్ నాయకులు బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్ గౌడ్, నెర్వెట్ల శ్రీనివాస్, పుల్లూరి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ తన్వీర్‌సింగ్ తక్షణమే రాహుల్ గాంధీకి క్షమాపణ చెప్పాలన్నారు. మోదీ, అమిత్‌షా, తన్వీర్‌సింగ్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. తమ నేతను విమర్శించే అర్హత లేదన్నారు. చట్ల సంతోష్, ఆకారం రమేష్, ఎండి జమీల్, శంకర్, వడ్లూరి సునీల్ కుమార్, అంజనేయులు గౌడ్, ఉదయ్ పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆరోగ్య మిత్రలు

నస్పూర్, సెప్టెంబరు 20: రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌లో పని చేస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌కు అందించారు. నాయకులు మాట్లాడుతూ ఆరోగ్య మిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్, కనీస వేతనం, ఉద్యోగ భద్రత సౌకర్యం కల్పించాలన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు పారిపల్లి మల్లేష్, నానయ్య, నాయకులు అనిత, సరిత, రవీందర్, వెంకటేశ్, వసంత, సౌందర్య, శారద, కవిత, లత, భాగ్యలక్ష్మి, రాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలి


ఓటరు సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్, సెప్టెంబరు 20: ఓటరు జాబితా తయారీ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల కమిషన్ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బూత్ నెంబర్ 95లో బీఎల్‌వోలు చేస్తున్న ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలించారు. సర్వే ఎలా చేస్తున్నారని బీఎల్‌వోలను అడిగి తెలుసుకొని రికార్డులను తనిఖీ చేశారు. మృతుల పేర్లను ఓటరు లిస్టు నుంచి తొలగించాలని ఆదేశించారు. సహాయ అధికారి పరశురాం, తహసీల్దార్ వనజారెడ్డి, ఆర్ఐ తిరుపతి, బీఎల్‌వోల సూపర్‌వైజర్‌లు స్వామి, తిరుపతి, రవిచందర్, శారదలు పాల్గొన్నారు.

ఈ నెల 23న బ్లాక్ డేగా పాటించాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 20: కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 23న బ్లాక్ డేగా పాటించాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మణిరాంసింగ్, నాయకులు నారాయణ, మల్లయ్యలు తెలిపారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. కోడ్‌లను రద్దు చేయాలని పోరాటాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. జీవరత్నం, రాజు, హసన్, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీనియర్ ఓపెన్ క్యారమ్ ర్యాంకింగ్ టోర్నమెంట్

బెల్లంపల్లి, సెప్టెంబరు 20: రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ సౌజన్యంతో ఈ నెల 28 నుంచి అక్టోబర్ 1 వరకు హైదరాబాద్‌లో రాష్ట్ర సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ జరుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బాలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజన్నలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పురుషులకు సింగిల్స్, డబుల్స్ పోటీలు, మహిళలకు సింగిల్స్, వెటరన్ పురుషులు, మహిళలకు సింగిల్స్ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9440010404లో సంప్రదించాలన్నారు.

సింగరేణి కార్మికులకు 33 శాతం లాభాల వాటా



- దసరాకు సీఎం రేవంత్ తీపి కబురు
- ఒక్కో కార్మికుడికి రూ. 1.9 లక్షలు బోనస్
- ఒప్పంద కార్మికులకూ రూ. 5 వేలు చెల్లింపు

మంచిర్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల్లో దసరా బోనస్‌గా 33 శాతం వాటా ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు శుక్రవారం సచివాలయంలో లాభాల బోనస్‌ను ప్రకటించారు. ఆర్థిక సంవత్సరంలో మొత్తం నికర లాభాలు రూ.4,701 కోట్లు కాగా ఇందులో రూ.2,412 కోట్లలో 33 శాతం కింద రూ.796 కోట్లను కార్మికులకు పంచనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో లాభాల వాటా కింద ఒక్కో కార్మికునికి సగటున రూ.లక్షా 90వేలు బోనస్‌గా అందనున్నాయి. మరో రూ.2,289 కోట్లతో సింగరేణి భవిష్యత్, వ్యాపార విస్తరణ ప్రణాళికలు చేపట్టనున్నారు. కాగా సింగరేణి చరిత్రలోనే ఇది అత్యధిక లాభాల బోనస్‌గా చెప్పవచ్చు.

గతేడాది కన్నా రూ.20 వేలు అదనం

ప్రభుత్వం ప్రకటించిన లాభాల వాటా గతేడాదితో పోల్చితే ఒక్కో కార్మికునికి రూ.20 వేలు అదనంగా అందనున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి యాజమాన్యం లాభాల్లో 32 శాతం వాటాను ప్రకటించింది. రూ.711 కోట్లను కార్మికులను వాటా కింద అందజేసింది. ఇప్పుడు దానికి అదనంగా రూ.85 కోట్లు అధికంగా లాభాల వాటా చెల్లించనున్నారు. గత సంవత్సరం సగటున ఒక్కో కార్మికుడికి రూ.లక్షా 70 వేలు లాభాల బోనస్‌గా అందగా ప్రస్తుతం అదనంగా రూ. 20వేలు చెల్లించనున్నారు.

కాంట్రాక్టు కార్మికులకూ లాభాల బోనస్

సింగరేణిలో పొరుగు సేవల కింద పని చేస్తున్న కాంట్రాక్టు, ఒప్పంద కార్మికులకు కూడా లాభాల బోనస్ అందజేయనున్నట్లు ప్రకటించారు. సింగరేణి చరిత్రలోనే తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ లాభాల బోనస్ ప్రకటించడం గమనార్హం. సింగరేణి వ్యాప్తంగా 25వేల మంది కాంట్రాక్టు, ఒప్పంద కార్మికులు పని చేస్తుండగా సగటున వారికి కూడా రూ.5 వేల వరకు లాభాల బోనస్ చెల్లించేందుకు నిర్ణయించారు.

సమష్టి కృషి..: జనక్ ప్రసాద్, సెక్రెటరీ జనరల్ ఐఎన్‌టీయూసీ

కార్మికుల సమష్టి కృషి, ప్రభుత్వ సహకారంతో మునుపెన్నడూ లేని విధంగా సింగరేణి కార్మికులకు 33 శాతం లాభాల వాటా దక్కనుంది. గత సంవత్సరంతో పోల్చితే లాభాల వాటా పెంచేందుకు కార్మికుల తరుపున ప్రభుత్వాన్ని ఒప్పించడం జరిగింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతోనే...

సీతారామయ్య, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు

సింగరేణి కార్మికులకు 33 శాతం లాభాల వాటా చెల్లించేలా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తరుపున ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం తగిన రీతిలో స్పందించింది. అలాగే వరద బాధితుల సహాయార్థం రూ. 10.25 కోట్లను కూడా కార్మికుల జీతాల నుంచి కోత లేకుండా యాజమాన్యం వాటా నుంచి చెల్లించేలా ప్రభుత్వాన్ని ఒప్పించాం.

చెరువు మత్తడి పేల్చివేత కేసులో నిందితుల అరెస్టు
7 లో..







విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, సెప్టెంబరు 20: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు నాణ్యమైన విద్యాబోధన అందించి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి రిజిష్టర్‌లు, వంటశాల, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, విషజ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను తెలియజేసి తాగునీరు, ఆహారం తీసుకునే సమయంలో తప్పనిసరిగా చేతులను శుభ్రపర్చుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు కలెక్టర్ స్వయంగా పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం భూమిని పరిశీలించారు. మండలంలోని టేకులపల్లి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం సకాలంలో అందించాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రిజిష్టర్‌లను, రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట మండల అధికారులు ఉన్నారు.

పేదల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి


వెల్గనూర్‌లో పార్టీ సభ్యత్వ నమోదులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు

దండేపల్లి, సెప్టెంబరు 20: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా శుక్రవారం గూడెం, నంబాల, వెల్గనూర్ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి మొబైల్ ఫోన్ ద్వారా సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశంలో అవినీతి రహిత పాలన ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమని, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. పార్టీ సభ్యత్వానికి 880002024 నెంబర్‌కు మిస్‌కాల్ ఇవ్వాలని ఆయన సూచించారు. బీజేపి మండల ఇన్‌చార్జి గుండ ప్రభాకర్, పార్టీ మండల అధ్యక్షకార్యదర్శు గోపతి రాజయ్య, బందెల రవిగౌడ్, ఎంబడి సురేందర్, సిపిరిశెట్టి శ్రీనివాస్, నాయకులు కర్నాల కిషన్, మొరుపుటాల సంజీవ్ తులసి, పంచేర్పుల సత్యం, యేసన్న, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆర్థికాభివృద్ధి

దండేపల్లి, సెప్టెంబరు 20: ఆయిల్ పామ్ తోటల పెంపకంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి అనిత, మ్యాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్‌కిరణ్‌లు అన్నారు. ముత్యంపేట రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మండల రైతులు ఆయిల్ పామ్ సాగు విధానం, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ గిట్టుబాటు ధరలు లేని ఇతర పంటల కంటే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అంతర పంటలు. సబ్సిడీ, తోటల నిర్వహణపై వారు వివరించారు. పలు గ్రామాల్లో సాగు చేసిన తోటను పరిశీలించారు. ఉద్యానవన శాఖ క్లస్టరు అధికారి తిరుపతి, సంస్థ ఎఫ్ఈ మల్లేష్ రైతులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

బెల్లంపల్లి, సెప్టెంబరు 20: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి కాకతీయ యూనివర్శిటీ పీజీ రెగ్యులర్ కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, పీజీ కోఆర్డినేటర్ మేడ తిరుపతిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌తోపాటు ఎంఏ ఇంగ్లీష్, ఎంకామ్ కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను సీపీ గేట్ పీజీ ఎంట్రన్స్ పరీక్ష రాసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 21 నుంచి రెండో విడత పీజీ సీట్ల కోసం రిజిస్ట్రేషన్‌లు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 9959269975, 7780418194లో సంప్రదించాలని తెలిపారు.

నేడు సంకట హర చతుర్థి

నస్పూర్, సెప్టెంబరు 20: హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మీ గణపతి ఆలయంలో శనివారం సంకట హర చతుర్థి ప్రత్యేక పూజలు, ఫలామృతాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతి రావు, ప్రధానార్చకులు వంశీకృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు.



గల్ఫ్ కార్మికుల విజయోత్సవ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి నాయకులు, కార్మికులు

జన్నారం, సెప్టెంబరు 20: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా 2023 డిసెంబరు 7 తర్వాత మృతిచెందిన గల్ఫ్ కార్మికులకు వర్తింపు, గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనం కోసం అడ్వైజరీ కమిటీ ఏర్పాటు, ప్రవాసీ ప్రజావాణి, గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకులాల్లో ప్రాధాన్యం ఇస్తూ జీవో జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేసిందన్నారు. గౌరవాధ్యక్షుడు గోపాల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, కన్వీనర్ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీ, మాణిక్యం, షాకీర్, సభ్యులు పాల్గొన్నారు.

